సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 29 । నవంబర్ । 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



సాయుధ పోలీసుల కవాతు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో మంగళవారం ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో సాయుధ పోలీసులు కవాతు నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వేచ్ఛగా ఓటింగ్ జరిగేలా చూడాలి



సమీక్షిస్తున్న అజయ్ వి.నాయక్, దీపక్‌మిశ్రా

సిరిసిల్ల: జిల్లాలో ప్రశాంత వాతవరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు అజయ్ వి.నాయక్, రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రాలు కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. మగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లపై కలెక్టర్ అనురాగ్ జయంతి, భద్రత ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుందుకు పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్‌సోన్‌కర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినితసాహు, వ్యయ పరిశీలకులు జి.మణిగండసామి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, రిటర్నింగ్ అధికారులు ఆనంద్ కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి



ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి తదితరులు

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారం ముగియడంతో సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో పట్టణంలోని పలు ఏరియాల్లో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేసే వారికి హెచ్చరికగా, ప్రజలకు ధైర్యం కలిగించేలా అనేకసార్లు ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి ఏదేని జరిగితే సమాచారం ఇవ్వాలని, అలాంటి వారిపై చట్టపరిధిలో చర్యలకు వెళ్తామన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్ఐ మల్లేశం, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టల్ బ్యాలెట్ సమస్య తీర్చాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లటౌన్: ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సమస్యను వెంటనే తీర్చకుంటే సహాయ నిరాకరణ తథ్యమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల ఆర్డీవో (రిటరింగ్ ఆఫీసర్) ఆఫీస్ ఎదుట టీపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపి మాట్లాడారు. జిల్లాలోని సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో వందలాది సంఖ్యలో ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని వారికి ఇప్పటికీ పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందలేదన్నారు. ఉపాధ్యాయుల పోరాటం ఫలితంగానే చొప్పదండి ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ పత్రాలు వచ్చాయన్నారు. ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్లు అందించి ఇప్పటివరకు ఓటు హక్కు వినియోగించుకోని వారికి డిసెంబర్ 2 వరకు ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. నాయకులు భూక్యా హజునాయక్, రవిబాబు, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం షాపుల మూసివేత



మద్యం షాపును మూసివేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎన్నికల నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 48 గంటల పాటు మద్యం షాపులు మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 14 వైన్ షాపులు, కల్లు దుకాణాలను పోలింగ్ ముగిసేవరకు బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ష్..గప్‌చుప్!

ప్రచారం పరిసమాప్తం

జంగ్ తెలంగాణ

- సైలెన్స్ పీరియడ్ మొదలు
- ప్రధాని, సీఎం, రాహుల్ ప్రముఖుల సభలు
- పాతజిల్లాల్లో 50 రోజుల ఎన్నికల ప్రచారం
- సభలు, రోడ్ షోలు, ర్యాలీలతో బలప్రదర్శన
- ఎత్తుకు పైఎత్తులతో హోరెత్తించిన అభ్యర్థులు



నగరంలో మూసివేసిన బార్ అండ్ రెస్టారెంట్



సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: ఎన్నికల పర్వంలో మరో ఘట్టం మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో సీఎం కేసీఆర్‌తో మొదలైన సభల సందడి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్‌తో ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే రాజకీయ చైతన్యానికి ప్రతీక. అందుకే, ఈ జిల్లాలో మెజారిటీ సీట్లు సాధించిన వారే రాజధానిలో అధికారంలో ఉంటారన్న నమ్మకం అనాదిగా వస్తోంది. అందుకే, ఈ జిల్లాపై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రత్యేక దృష్టి సారించి, సర్వశక్తులు ఒడ్డి ప్రచారం చేశాయి.

ప్రముఖుల సభలతో ఊపు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే కేసీఆర్‌కు ఉద్యమ కాలం నుంచి ప్రత్యేక అభిమానం. అందుకే, ఆయన ఈ జిల్లాలో పలుమార్లు సుడిగాలి పర్యటన చేశారు. హుస్నాబాద్‌తో మొదలు పెట్టిన సీఎం కేసీఆర్ తరువాత విడతల వారీగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆఖరుగా వేములవాడతో ఉమ్మడి జిల్లా సభలు ముగించారు. అలాగే కేటీఆర్ కూడా 13 నియోజకవర్గాల్లో పర్యటించారు.

- ప్రధాని మోదీ కరీంనగర్‌కు, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా (జమ్మికుంట), యూపీ సీఎం యోగి (వేములవాడ), మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే (ధర్మపురి)లు బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంథని, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, వేములవాడలో పర్యటించారు. వీరే కాక రేవంత్‌రెడ్డి, జైరాంరమేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాగేల్ తదితరులు సభల్లో పాల్గొన్నారు.

50 రోజులు హోరెత్తిన ప్రచారం..

గతనెల 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దరిమిలా.. ఎన్నికల సందడి మొదలైంది. అభ్యర్థుల ఖరారు, నామినేషన్లతో జోరందుకున్న ప్రచారంలో మొత్తంగా దాదాపు 50 రోజులుగా అభ్యర్థులు ఒక్కొక్కరు ఒక్కో స్టైల్‌లో దూసుకెళ్లారు. కొందరు అభ్యర్థులు భారీ బహిరంగ సభల ద్వారా బలప్రదర్శన చేయగా, మరికొందరు నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నమ్ముకున్నారు. ప్రజలకు తమ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలతో పాటు, తమదైన హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవటానికి యత్నించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు, వారి కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాల్గొన్నారు.

సైలెన్స్ పీరియడ్ మొదలు..

ఉమ్మడి జిల్లాల్లో 13 నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది. మైకులు మూగబోయాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సైలెన్స్ పీరియడ్‌గా ప్రకటించారు. అభ్యంతరకర, రాజకీయపరమైన, బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రసారంపై నిషేధం ఉందని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రచారం తర్వాత తెర వెనుక పంపిణీలపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టారు. బల్క్ మెసేజ్‌లు, సోషల్ మీడియాలపైనా నిఘా పెట్టారు.

నియోజకవర్గం.. పోలింగ్ స్టేషన్ల వివరాలు..

కరీంనగర్ నియోజకవర్గంలో 390 పోలింగ్ స్టేషన్లు, చొప్పదండిలో 327, మానకొండూరులో 316, హుజూరాబాద్‌లో 305, రామగుండంలో 259, మంథనిలో 288, పెద్దపల్లిలో 290, వేములవాడలో 170, సిరిసిల్లలో 287, కోరుట్లలో 262, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

నియోజక వర్గాలవారీగా ఓటర్ల వివరాలు..

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	బరిలో అభ్యర్థులు
కరీంనగర్	1,77,893	1,77,117	44	102	27
చొప్పదండి	1,13,050	1,19,933	07	193	14
మానకొండూరు	1,08,846	1,12,766	01	128	10
హుజూరాబాద్	1,21,809	1,27,743	06	164	22
జగిత్యాల	1,11,720	1,19,728	20	45	15
కోరుట్ల	1,15,027	1,25,824	04	46	15
ధర్మపురి	1,11,172	1,15,702	06	133	15
సిరిసిల్ల	1,19,663	1,24,756	07	106	21
వేములవాడ	1,06,890	1,15,331	30	53	16
పెద్దపల్లి	1,26,046	1,28,212	08	264	17
రామగుండం	1,11,200	1,09,794	25	213	23
మంథని	1,16,707	1,19,716	19	155	21

ఐటీ పరిశ్రమలు తెస్తా



సిరిసిల్లలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- మనోళ్లకు ఇక్కడే ఉపాధి కల్పిస్తా
- వస్త్రపరిశ్రమలో వర్కర్లను ఓనర్లు చేస్తా
- అభివృద్ధికి ఇది ట్రైలర్ మాత్రమే.. సినిమా ముందుంది
- విలీన గ్రామాలను సిరిసిల్ల నుంచి విముక్తి చేస్తాం..
- రోడ్ షోలో మంత్రి కె.తారకరామారావు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఐటీ పరిశ్రమను తెచ్చి మనోళ్లకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామరావు అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో రోడ్ షో నిర్వహించి మాట్లాడారు. 2009లో మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యానని, ఏమిచ్చినా మీరుణం తీర్చులేనిదని, తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువేనన్నారు. సిరిసిల్ల అభివృద్ధి ఇప్పటి వరకు జరిగింది ట్రైలరేనని, అసలు సినిమా ముందుందన్నారు. సిరిసిల్ల నలుదిశలా కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ రోడ్లన్నీ ఫోర్‌లేన్ రోడ్లుగా మార్చుతానని పేర్కొన్నారు. మధ్యమానేరు జలాశయాన్ని టూరిజం హబ్‌గా మార్చి, ఆక్వా హబ్‌తో ఉపాధి కల్పిస్తానని స్పష్టం చేశారు. సిరిసిల్లకు రైలు వస్తుంది, చరిత్రలో నిలిచిపోయేలా పనులు చేస్తానని, దేశానికి ఆదర్శంగా నిలుపుతానన్నారు.

యారన్ డిపోలు ఏర్పాటు..

సిరిసిల్ల వస్త్రపరిశ్రమను పూర్తి స్థాయిలో ఆదుకుంటానని, యారన్ డిపోలు ఏర్పాటు చేయించి ఆసాములకు అండగా ఉంటానని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకం రూ.400 కోట్లతో నిర్మాణంలో ఉందని, కాటన్ పరిశ్రమను పూర్తి స్థాయిలో అదుకుంటామన్నారు. వస్త్రపరిశ్రమను తమిళనాడులోని తిరుపూర్ స్థాయిలో అభివృద్ధి చేసి బ్రాండ్ సిరిసిల్లగా మార్చుతానన్నారు. కులం, మతం కూడుపెట్టదని అన్నారు. కార్మిక వాడల్లో ప్రభుత్వ పట్టాలను క్రమబద్ధీకరించి హక్కులు కల్పిస్తామని, ఆ స్థలాలను అమ్ముకోవచ్చు, తనఖా పెట్టుకోవచ్చని వివరించారు.

విలీన గ్రామాలను విముక్తి చేస్తాం

సిరిసిల్లలో విలీనమైన గ్రామాలను అవసరమైతే పట్టణం నుంచి వేరు చేసి గ్రామపంచాయతీలుగా ఉంచుతామని కేటీఆర్ అన్నారు. ఇకపై ప్రతి వారంలో రెండు రోజులు మీతోనే ఉంటానని వివరించారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా తనను కలిసేలా సమయం ఇస్తానని స్పష్టం చేశారు. సిరిసిల్లలో ఇప్పటికే కొన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టుకున్నామని, ఇంకా మిగిలిపోయిన వారికి, పూర్తి స్థాయిలో ఇల్లు లేని వారిని గుర్తించి పక్కా ఇళ్లను అందిస్తామన్నారు. సిరిసిల్లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి ముంపు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, ఆ కార్డులపై సన్న బియ్యం వస్తాయని వివరించారు. కులం, మతం పేరిట ఆగం కావద్దని ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు బాగా పని చేశారని, వారికి రుణపడి ఉంటానని కేటీఆర్ అన్నారు. కాగా సిరిసిల్ల కొత్త బస్టాండు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నిర్వహించిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. గులాబీ జెండాలతో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు దారి పొడవునా మంత్రికి స్వాగతం పలికారు. గాయకులు మాట్ల తిరుపతి, దరువు ఎల్లన్న, నక్క శ్రీకాంత్ బృందం పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మాజీ చైర్మన్ గుడ్ల మంజుల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రామ్మోహన్, అగ్గిరాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం సాయంతో వేములవాడ అభివృద్ధి



మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్‌రావు



వేములవాడలో మహిళలు, యువతుల బైక్ ర్యాలీ

- బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు

వేములవాడ: తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి రాజన్న గుడితోపాటు పట్టణం, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మంగళవారం చివరిరోజు ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం యువతులు, మహిళల బైక్ ర్యాలీని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, డాక్టర్ దీపతో కలిసి ప్రారంభించారు. విద్య, వైద్యం, రోడ్లు, రవాణా, వ్యవసాయం, యువతకు ఉపాధి మార్గాలు మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీ నాయకుల ప్రచారం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లి, బావుసాయిపేట, మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ వికాస్‌రావును గెలిపించాలని కోరారు. నోముల భాస్కర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. కనగర్తిలో బైక్‌ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు.

జిల్లా ముఖ్య నేతల ప్రచారం

కథలాపూర్(వేములవాడ): బీజేపీ అభ్యర్థి వికాస్‌రావుకు మద్దతుగా కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో ఆ పార్టీ జిల్లా నాయకులు ప్రచారం చేశారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్, భూషణరావుపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అవినీతి లేని పాలన అందించడం బీజేపీతోనే సాధ్యమన్నారు. నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, కొడిపెల్లి గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



మంత్రి కేటీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మంగళవారం కామారెడ్డి నుంచి సిరిసిల్లకు వస్తున్న మంత్రి కేటీఆర్ వాహనాన్ని అధికారులు, సిబ్బంది తనిఖీ చేశారు.

వైన్ షాపుల్లో స్టాక్ పరిశీలన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వైన్ షాపుల్లో నిల్వ ఉన్న మద్యాన్ని మంగళవారం ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి మండలంలో పర్యటించి మద్యం స్టాక్‌ను నమోదు చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి గురువారం సాయంత్రం 5 గంటల వరకు వైన్ షాపులను మూసివేసి సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని వివరించారు. ఈ నెల 30న ఎన్నికలు జరుగుతాయని, బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీకి సిరిసిల్ల, వేములవాడలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం నిలిచిపోయిందని, సైలెంట్ పీరియడ్ మొదలైందన్నారు. ఇకపై ఎలాంటి ప్రచారానికి తావులేదని, స్థానికేతరులు నియోజకవర్గాలను వదిలి వెళ్లాలన్నారు. అనుమతి పొందిన ప్రకటనలకు ప్రింట్ మీడియాలో అవకాశం ఉందని పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన అరగంట వరకు ఎగ్జిట్ పోల్స్ నిషేధమన్నారు. పోలింగ్ స్టేషన్లకు మొబైల్ ఫోన్లు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత కల్పించామని తెలిపారు. జిల్లాలో 77 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో మామిండ్ల దశరథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనురాగ్ జయంతి

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు..

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అనురాగ్ జయంతి కేంద్ర ఎన్నికల అధికారులకు తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల అధికారులు మంగళవారం కలెక్టర్, ఎస్పీతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో గల 547 పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ మంగళవారం పూర్తయింది. కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు జగదీశ్ సోన్‌కర్, పోలీస్ పరిశీలకురాలు వినితా సాహు, కలెక్టర్ అనురాగ్ జయంతి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. డీఈవో రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు



యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసే యువకులు పార్టీలో చేరుతున్నారని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. ఈసందర్భంగా ఓటు హక్కు పొందిన యువకులు తమ మొదటి ఓటును అభివృద్ధి, సేవాభావం చూసి బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావుకే వేస్తామని పేర్కొంటూ కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 50 మంది మంగళవారం ప్రకటించారు. గ్రామ సర్పంచ్ మంతెన సంతోష్, ఎంపీటీసీ పల్లె మంజులరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని చల్మెడ నివాసంలో ఆయన్ని కలిసి ×మీకే మా మొదటి ఓట్లు అంటూ ప్రకటించారు. ఈనేపథ్యంలో చల్మెడ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఇంటింటా ప్రచారం



మరిమడ్లలో ప్రచారం చేస్తున్న విజయభాస్కర్‌రావు తదితరులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మరిమడ్లలో కేటీఆర్ మేనబావ విజయభాస్కర్ రావు, మండల నాయకురాలు నేరెళ్ల జ్యోతి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పల్లిమక్త, కనగర్తిలో నాయకులు జిన్న అనిల్, చింతకుంట అనిల్, ఎనగంటి కిషన్, భూంరెడ్డి, గోపాల్, కిషన్ ఈవీఎంలు చూపుతూ ప్రచారం నిర్వహించారు. మల్కపేటలో సింగిల్‌విండో డైరెక్టర్ జవ్వాజి దేవయ్య కార్యకర్తలతో కలిసి ఇంటింటా ఓట్లు అభ్యర్థించారు.

గ్యారంటీలు అమలుచేసే బాధ్యత నాదే



బాండ్ పేపర్ చూపుతున్న ఆది శ్రీనివాస్

- కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ: 'ఈ ఎన్నికల్లో నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై రాజన్న సాక్షిగా బాండ్ పేపర్‌పై సంతకం చేసి అందిస్తున్నా.. గ్యారెంటీలు అమలుచేసే బాధ్యత నాదే' అని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. ఇచ్చిన మాటకు రాజన్న సాక్షిగా కట్టుబడి ఉంటానని మంగళవారం రాజన్నను దర్శించుకున్న అనంతరం ఆలయ మెట్ల వద్దే బాండ్‌పేపర్‌ను నియోజకవర్గ ప్రజలకు మీడియా ద్వారా అందజేశారు. అనంతరం పట్టణంలో ప్రచారం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

'ఆది'కి నీరాజనం



లింగంపల్లిలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వేములవాడరూరల్/కోనరావుపేట/రుద్రంగి/వేములవాడఅర్బన్: వేములవాడరూరల్ మండలం లింగంపల్లి తదితర గ్రామాల్లో ఆది ప్రచారం చేపట్టగా ప్రజలు నీరాజనం పలికారు. అలాగే కోనరావుపేట మండలం మామిడిపల్లి, మరిమడ్లలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆది శ్రీనివాస్‌ను గెలిపించాలని రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత కోరారు. 70 ఏళ్లుగా ఒకే కుటుంబం వేములవాడ ప్రాంతాన్ని పాలించిందని, బీసీ ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు అవకాశం రాలేదని టీపీసీసీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ బుర్ర రవితేజగౌడ్ ప్రకటనలో తెలిపారు. బీసీ బిడ్డ అయిన ఆది శ్రీనివాస్‌కు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

సంతానం కలగడం లేదని వ్యక్తి ఆత్మహత్య

కోనరావుపేట(వేములవాడ): వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలంలోని కొండాపూర్‌కు చెందిన బెదిరె చిన్న దేవయ్య(50)–భీరవ్వ దంపతులకు సంతానం కలగలేదు. ఈ విషయమై, ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవయ్య మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపానికి గురై, మంగళవారం ఉదయం స్థానిక పెద్దమ్మ ఆలయ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఏఎస్‌ఐ రఘుపతిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


వజ్రవ్వ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల గ్రామానికి చెందిన శ్రీరాముల వజ్రవ్వ(56) ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ రమాకాంత్ తెలి పిన వివరాల ప్రకారం.. వజ్రవ్వ కొంతకాలంగా పక్షవాతంతో బాధ పడుతోంది. అనేక ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది, సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి, క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చనిపోయింది. మృతురాలి కూతురు సిరిపురం పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు జైలు

కోనరావుపేట(వేములవాడ): ఆటోను నిర్లక్ష్యంగా నడిపి, బావిలో పడగొట్టి, ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఏడాదిన్నర జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2015 సెప్టెంబర్ 2న సిరిసిల్ల నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో కోనరావుపేట మండలం మర్తనపేట శివారులోని కలకోట దేవయ్య ఇంటి పక్కనున్న పాడుబడ్డ బావిలో పడింది. ఈ ప్రమాదంలో మర్తనపేట, ధర్మారం, మల్కపేట గ్రామాలకు చెందిన పలువురు ప్రయాణికులు గాయపడగా ధర్మారం వాసి పిట్టల రామస్వామి మృతి చెందాడు. అప్పటి సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మాలకొండ రాయుడు కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ఆటోడ్రైవర్ తీపిరి మహేందర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదానికి కారణమైనట్లు రుజువైంది. దీంతో అతనికి జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎవరైనా వాహనాలను అజాగ్రత్తగా నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు.

నమ్మకు నమ్మకు ఈ రేయిని..

- మైకులు బంద్.. ప్రలోభాలు షురూ
- ఎన్నికల్లో ఎలాగైనా గెలవాల్సిందే..
- శాసిస్తున్న 'పంచ'భూతాలు..!
- గెలుపే లక్ష్యంగా నేతల వ్యూహాలు



సిరిసిల్ల: ఎన్నికల పర్వం ఆఖరి అంకానికి చేరింది. ప్రచారం ముగిసింది.. ప్రలోభాలు షురువయ్యాయి. ఈ రోజు రాత్రి గడిస్తే చాలు ఇక ఎన్నికలే. ఇలాంటి కీలక సమయంలో.. నమ్మకు నమ్మకు ఈ రేయిని అంటూ ప్రధాన పార్టీ అభ్యర్థులు, అనుచరులు వ్యూహాత్మక ఎత్తులతో ఓటర్లను వశపర్చుకునేందుకు తాయిలాలను ఎర చూపుతున్నారు. జిల్లాలో ఎన్నికలను పంచభూతాలు శాసిస్తున్నాయి. ప్రచారం ముగియడంతో అసలు అధ్యాయానికి తెరలేపారు. ఓటర్లను ప్రభావితం చేసే శక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈరోజు రాత్రి పంపకాలకు, మందు విందులకు రంగం సిద్ధమైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. జిల్లాలో ఆవహిస్తున్న 'పంచ'భూతాలపై కథనం.

హామీల ఎర..

ఎన్నికల్లో గెలిస్తే మీ సామాజికవర్గానికి భవనాలు కట్టిస్తామని, మీ ఊరికి ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని రకరకాల హామీలిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు నాయకులు యథాశక్తిగా ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, తర్వాత మరిచిపోవడం సాధారణమే అయినా ఈసారి మాత్రం అభ్యర్థులు క్షేత్రస్థాయిల్లో పర్యటిస్తూ హామీలు గుప్పిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ఓటర్ల వద్దకు పదే పదే వెళ్తూ ప్రదక్షణలు చేస్తున్నారు.

మద్యం మత్తు..

ఎన్నికల్లో మద్యం ప్రధాన ఇంధనంగా మారింది. ప్రచారంలో అలసి సొలసిన నాయకులకు, కార్యకర్తలకు మందుతోనే స్వాంతన లభిస్తుందని భావిస్తున్నారు. ఎన్నికల వేళ బీరు, లిక్కర్, బ్రాంది, విస్కీ, కల్లు పంపిణీ చేసేందుకు అన్నిపక్షాల నాయకులు సిద్ధమయ్యారు. ఇప్పటికే మందు విక్రయాలు బాగా పెరిగి ద్వితీయ శ్రేణి నాయకులు మత్తులో జోగుతున్నారు. ఈసారి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'బెల్ట్' షాపులకు తాళాలు పడగా, గతంలో ఎన్నడూ లేనంతగా పోలీసులు పూర్తిస్థాయిలో బెల్ట్ షాపులను నియంత్రించారు. కానీ దొంగచాటుగా అమ్మకాలు సాగుతున్నాయి. ఓటర్లను మత్తులో ముంచేందుకు నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే లెక్కలేస్తూ మందు బాటిళ్లను పట్టణాల్లో వార్డుల వారీగా, గ్రామాల్లో ప్రచార గ్రూపుల వారీగా పంపిణీ చేస్తున్నారు.

ముంచెత్తనున్న డబ్బు

రాజకీయాలంటేనే ప్రజాసేవ అనే ధోరణి మారిపోయి లాభసాటి వ్యాపారంలా పరిణమించాయి. ఎంత వెచ్చించాం, ఎంత సంపాదించామనే వ్యాపార లక్షణం కనిపిస్తుంది. దీంతో కాసులున్న వారికే టికెట్ ఇస్తామన్నట్లు అన్ని పార్టీలు ఎన్నికల్లో ఎంత మొత్తంలో వెచ్చిస్తావంటూ ఆశావహుల్ని బహిరంగంగానే ప్రశ్నించి టిక్కెట్లు ఇచ్చాయి. ఒక్కో అభ్యర్థి స్థాయిని బట్టి ఖర్చులకు వెనకాడకుండా నీళ్ల ప్రాయంలా డబ్బులు వెదజల్లుతున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఎన్నికలు మరీ ఖరీదు అయ్యాయి. ఒక్కో అభ్యర్థి అనధికారికంగా రూ.5 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ముగ్గురు, నలుగురు అభ్యర్థులు బరిలో ఉంటే రూ.వందల కోట్ల ఖర్చులు దాటిపోతున్నాయి. అంటే ధన ప్రవాహం ఎన్నికల్లో ఎంత ప్రభావం చూపుతుందో స్పష్టమవుతుంది.

పనులిస్తామని హామీ

అందుబాటులో ఉండే అనుయాయులకు పనులిప్పిస్తామని, కాంట్రాక్టులు ఇప్పించి కాసులు దోచిపెడుతామంటూ నాయకులు హామీలిస్తూ ద్వితీయస్థాయి క్యాడర్‌ను రూపొందించుకుంటున్నారు. ఎన్నికల్లో గెలిస్తే చాలు మీ అందరికీ నేనున్నానంటూ గుప్పిట పెట్టుకుంటున్నారు. వారి ద్వారా క్షేత్రస్థాయిలో ఓట్లను కొల్లగొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్లు కొనిస్తూ, ద్విచక్ర వాహనాలను సమకూర్చుతూ ఎన్నికల ప్రచారానికి యువతరాన్ని వినియోగించుకుంటున్నారు. ×నేను గెలిస్తే.. భవిష్యత్ ఉంటుందంటూ ఆశలురేపుతూ, హామీలతో ఎన్నికల కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

తాయిలాలు ఎందరికో..

వివిధ కుల సంఘాలు, వృత్తిసంఘాలు, యువజన సంఘాలకు తాయిలాలు ఇస్తామని బాస చేస్తూ ఎన్నికలపై దృష్టిపెట్టారు. సామాజిక భద్రత కల్పిస్తామని హామీలిస్తున్నారు. యువజన సంఘాలకు క్రికెట్ కిట్లు ఇస్తూ జిమ్ ఏర్పాటు చేస్తామని ఆశ చూపడం విశేషం. విహార యాత్రలకు తీసుకెళ్తామని చెబుతున్నారు. మరోవైపు ఇవికాకుండా లోపాయికారి ఒప్పందాలు, తెరచాటు రాజకీయాలతో గెలుపే లక్ష్యంగా నాయకులు ముందుకు సాగుతున్నారు. ఏదీ ఏమైనా ఈసారి ఎన్నికల్లో ఈ పంచభూతాలు ఎన్నికల్ని ఆవహించి ఓటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కాగా ఈరోజు రాత్రి గడిస్తే చాలు.. ఓటర్లు తమ హక్కును వినియోగించుకునే సమయం ఆసన్నమైంది.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


మెడల్స్ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే ప్రభుత్వ బీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించారు. మెదక్ జిల్లా తుర్కపల్లిలో ఎంజేపీ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలు నిర్వహించారు. కళాశాలకు చెందిన రాజేశ్ 3కిలో మీటర్లు, 1,500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే వాలీబాల్ టోర్నమెంట్‌లో నగేశ్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.వీరప్రభాకర్, పీడీ రాజు, అధ్యాపకులు అభినందించారు.

అనువంశిక అర్చకుల సమస్యలు పరిష్కరిస్తాం


వనభోజనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడ అనువంశిక అర్చకుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. మంగళవారం బ్రాహ్మణుల కార్తీక వనభోజనాల్లో భాగంగా వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనువంశిక అర్చకుల న్యాయమైన డిమాండ్లను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లానని, రానున్న రోజుల్లో తప్పకుండా సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకన్న, తల్లం రాజు, రమణ తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

జగిత్యాలక్రైం: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బి.శేఖర్‌నాయక్ అనే కానిస్టేబుల్ తన నివాసానికి దగ్గరలో ఉండే మహిళ ఇంటికి అర్ధరాత్రి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ చేపట్టిన ఎస్పీ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖ మహిళల రక్షణకు కృషి చేస్తుందన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా 8712670783 లేదా 100 డయల్‌కు సమాచారం అందించాలన్నారు.

పడిపోయిన లిక్కర్ సేల్స్

- పెరిగిన బీర్ల అమ్మకాలు
- గతేడాది నవంబర్‌తో పోలిస్తే జిల్లాలో పరిస్థితి
- ఎన్నికల నేపథ్యంలో మూతపడిన వైన్స్



సిరిసిల్లలో మూసివేసిన వైన్స్

సిరిసిల్ల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం ఏరులై పారిందని, కోట్ల రూపాయల సొమ్ము మందుబాబులకే ఖర్చయిందని వైన్స్‌ల వద్ద గుమిగూడిన జనంతో అందరూ అనుకున్నారు. కానీ, అబ్కారీ శాఖ అధికారిక లెక్కల ప్రకారం.. జిల్లాలో గతేడాది నవంబర్ నెలలో విక్రయించిన మద్యం కంటే ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన అమ్మకాలు తక్కువగా ఉండటం గమనార్హం. మద్యం షాపుల నిర్వాహకులకు లైసెన్స్ గడువు ఈ నెలతో ముగిసింది. దీంతో ప్రస్తుత లైసెన్స్ లాటరీలో లక్కు దక్కనివారు లిక్కర్‌ను డిపో నుంచి తీసుకోలేదని, అందువల్లే అమ్మకాలు తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. కానీ, గడిచిన రెండు నెలల్లో మద్యం విక్రయాలను సరాసరి తీసుకుంటే దాదాపు సమానంగా అమ్మకాలు జరిగినట్లు చెబుతున్నారు. ఈ నెల 30తో లైసెన్స్ పీరియడ్ ముగిసిన నిర్వాహకుల వద్ద ఏదైనా మద్యం మిగిలితే దాన్ని నిబంధనల ప్రకారం అబ్కారీ శాఖకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, మిగిలిన మద్యాన్ని ఇవ్వడం దానికి సంబంధించిన డబ్బును తీసుకోవడానికి వేచి ఉండటం సమయం వృథా అన్న భావనతో ఎవరూ డిపో నుంచి స్థాయికి మించి మద్యాన్ని దించుకోలేదని ఎక్సైజ్ శాఖలోని ఓ సీనియర్ అధికారి తెలిపారు. గణాంకాల ప్రకారం యువత తీసుకునే బీర్ల అమ్మకాలు పెరిగినట్లు, పెద్దలు తీసుకునే లిక్కర్ సేల్స్ పడిపోయాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ జరిగే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం షాపులు మూసి ఉంటాయి.

నవంబర్ 2022లో అమ్మకాలు

లిక్కర్	– 32,883 కేస్‌లు
బీర్లు	– 46,385 కేస్‌లు
విలువ	– రూ.31.97 కోట్లు

నవంబర్ 2023లో ఇలా..

లిక్కర్	– 24,996 కేస్‌లు
బీర్లు	– 57,839 కేస్‌లు
విలువ	– రూ.28.03 కోట్లు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- 1,700 మంది పోలీసులతో బందోబస్తు
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలకు వెళ్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం హెచ్చరించారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలు, పార్టీల బాధ్యులను కోరారు. ఎన్నికల దృష్ట్యా జిల్లాలో 144 సెక్షన్ అమలవుతుందని డిసెంబర్ 1 ఉదయం 7 గంటల వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయని వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు 560 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 1,700 మంది జిల్లా, కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీరితో పాటు ప్రతీ మండలానికి సీఐ స్థాయి అధికారితో పాటు ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ (క్యూఆర్‌టీ), స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫో ర్స్ ఏర్పాటు చేసి భద్రత చర్యలకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో మీడియాకు ఎస్పీ పలు విషయాలు వెల్లడించారు.

- 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపుగా ఉండరాదు.
- రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ధరించడం, ప్రదర్శించడం నిషేధం.
- రాజకీయ పార్టీల పాటలు, ఉపన్యాసాలు ప్రచారం చేయరాదు.
- విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదు.
- ధర్నాలు, రాస్తారోకోలు నేరంగా పరిగణించబడతాయి.
- పోలింగ్ జరిగే రోజు కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అంతరాయం కలిగించే పేలుడు పదార్థాలను తీసుకెళ్లరాదు.
- పోలింగ్ కేంద్రం సమీపంలో 100 మీటర్ల పరిధిలో ఉన్న ఇంటి యజమానులు బయట వ్యక్తులను ఇంట్లోకి అనుమతించకూడదు. ఈ నిబంధన రాజకీయ పార్టీ బాధ్యుల ఇళ్లకు కూడా వర్తిస్తుంది.





కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నస్వామి వారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాసశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరాజం, సంపత్ పర్యవేక్షించారు.

సిరిసిల్లను 10 మంది దొరలు ఏలుతున్నరు

- గుట్టలు, చెరువులు, వాగులనూ వదలలేదు
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రైలు కూత, టూరిజం హబ్ ఏవి?
- బీజేపీ అభ్యర్థి రాణీ రుద్రమరెడ్డి
- మంత్రి కేటీఆర్‌పై 17 అంశాలతో చార్జిషీట్ విడుదల


మాట్లాడుతున్న రాణీ రుద్రమరెడ్డి

సిరిసిల్ల: సిరిసిల్లను పదేళ్లుగా 10 మంది దొరలు ఏలుతున్నరని, వారు ఏ తప్పు చేసినా మంత్రి కేటీఆర్ అండగా ఉంటున్నరని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల అభ్యర్థి రాణీ రుద్రమరెడ్డి ఆరోపించారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో మంగళవారం మంత్రి కేటీఆర్‌పై 17 అంశాలతో కూడిన చార్జిషీట్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇసుక దోపిడీని అడ్డుకున్నందుకు నేరెళ్లలో దళితులపై పోలీసులతో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, మానేరు వాగులో ఇసుక దోపిడీ చేసి, రూ.వేల కోట్లు దోచుకున్నారని అన్నారు. గుట్టలు, చెరువులు, వాగులనూ వదలకుండా ఆక్రమించారని మండిపడ్డారు. సెస్‌లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినా చర్యలు లేవని, ఆఫీస్ రికార్డులను ఆడిట్‌కు చిక్కకుండా కాల్చేసినా మంత్రి నుంచి స్పందన లేదన్నారు. సిరిసిల్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిరిసిల్లకు రైలు కూత, మల్కపేటకు గోదావరి జలాలు, టూరిజం హబ్ ఏవని ప్రశ్నించారు. ప్రతీ మండలాన్ని ఓ దొర ఏలుతున్నాడని, ఆడపిల్లలనూ వదలని రాక్షస ముఠాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. చెక్‌డ్యామ్‌లు కూలిపోయేలా నిర్మించిన కాంట్రాక్టర్లు కేటీఆర్ అనుచరులేనని, గల్ఫ్ కార్మికుల ఎన్ఆర్ఐ పాలసీ ఏదన్నారు. సిరిసిల్లను గాలికి వదిలేసిన కేటీఆర్‌కు మళ్లీ ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డితో హైదరాబాద్‌లో ఆయనకు వ్యాపారాలు ఉన్నాయని ఆరోపించారు. ఆ ఇద్దరు ఎన్నికల సమయంలో డ్రామాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, కరెండ్ల మల్లారెడ్డి, నాగుల శ్రీనివాస్, అశోక్, రాజు, సత్యనారాయణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

602 మంది మహిళలకు వైద్య పరీక్షలు


నేరెళ్ల ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్, సిబ్బంది


వేములవాడ ఆస్పత్రిలో..

సిరిసిల్ల: మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో మంగళవారం 602 మందికి వైద్య పరీక్షలు చేశారు. తంగళ్లపల్లి,నేరెళ్ల, సుందరయ్యనగర్, వేములవాడ, పోత్గల్, ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. మహిళా వైద్యులు, సిబ్బంది పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు పర్యవేక్షించారు.

కందికట్కూర్‌లో మద్యం పట్టివేత



తంగళ్లపల్లి(సిరిసిల్ల): కందికట్కూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ సిబ్బంది మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ.. ఎల్లమ్మ ఆలయ రోడ్డులోని బత్తిని శంకరయ్య ఇంట్లో రూ.22 వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిరాడంబరం.. ఆదర్శప్రాయం

- ఎమ్మెల్యేగా పనిచేసినా సొంతిల్లు కరువు
- ఆర్థిక సమస్యలతో సతమతం
- 'చితి'కిపోయిన మాజీ ఎమ్మెల్యే కుటుంబం
- అనారోగ్యంతో వైద్యమందక మృతిచెందిన కర్రెల్ల నర్సయ్య
- కైకిలి చేసి కన్నుమూసిన భార్య
- వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన తనయుడు


రేకుల షెడ్డు ఎదుట భార్య, కుమారుడితో ఆనందం (ఫైల్)


నర్సయ్య (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): జీవితంలో ఒక్కసారి ఎమ్మెల్యే అయితే చాలు.. తరతరాలకు సరిపడా ఆస్తిపాస్తులు కూడబెట్టుకునే నాయకులు ఉన్న ఈ రోజుల్లో ప్రజాసేవకే అంకితమై నిరాడంబర జీవితాన్ని గడిపిన ఓ మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కష్టాల కడలిని ఎదురీదారు. సదరు మాజీ ఎమ్మెల్యే అనారోగ్యంతో మృతిచెందగా.. అతని భార్య కూలీ పనులు చేసి కన్నుమూసింది. అనారోగ్యానికి వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ప్రాణాలు వదిలాడు. నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆ ఎమ్మెల్యే గురించి తెలుసుకుందాం..

1957లో గెలిచిన కర్రెల్ల నర్సయ్య

రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన కర్రెల్ల నర్సయ్య అప్పటి నేరెళ్ల(ఎస్సీ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా 1957–62 వరకు పనిచేశారు. అంతకుముందు స్వాతంత్య్ర సమరయోధునిగా పోరాడిన ఆయన ఎమ్మెల్యేగా ప్రజాసేవకు అంకితమయ్యాడు. ఆస్తులు సంపాదించకపోవడంతో ఆయనతోపాటు కుటుంబసభ్యులు పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారు.

నిస్వార్థ సేవకు నిదర్శనం

కర్రెల్ల నర్సయ్య ఎమ్మెల్యే అయినా నిరాడంబరంగా బతికారు. నర్సయ్యకు భాస్కర్, ఆనందం కుమారులు. భాస్కర్ సిరిసిల్లలో ఉంటుండగా, ఆనందం గ్రామంలోనే ఉంటూ సుతారి కార్మికునిగా పనిచేసుకునేవాడు.

వెంటాడిన ఆర్థిక సమస్యలు

మాజీ ఎమ్మెల్యే నర్సయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతూ 2003లో మృతిచెందాడు. ఎమ్మెల్యేగా పనిచేసిన ఆస్తులు సంపాదించలేదు. ఆయన భార్య దుర్గవ్వ పొట్ట గడవడం కోసం కూలీ పనులకు వెళ్లేది. దుర్గవ్వ 2018 అక్టోబర్ 17న మృతిచెందింది. గ్రామంలోనే సుతారి కార్మికునిగా పనిచేస్తున్న వీరి కుమారుడు ఆనందం కొంత కాలం అనారోగ్యంతో ఇబ్బందిపడి వైద్యం చేయించుకునేందుకు డబ్బుల్లేని స్థితిలో మరణించాడు.

ఇల్లులేని ఎమ్మెల్యే కుటుంబం

నర్సయ్యకు గ్రామంలో ఇల్లు ఉండేది. మరమ్మతు చేయించకపోవడంతో కూలిపోయింది. ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించేవారు. అంతటి నిస్వార్థ సేవ చేసిన నర్సయ్య అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

ప్రజాసేవకే అంకితమయ్యారు



మా నాన్న ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయంలో, అంతకుముందు కూడా ప్రజాసేవకే అంకితమయ్యారు. గ్రామంలో మాకు ఇల్లు కూడా లేదు. డబుల్‌బెడ్ రూం ఇల్లు అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ హామీ ఇచ్చినా ఇప్పటికీ ఇవ్వలేదు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలి.

– భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చిన్న కుమారుడు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
B.Tech. Exams

■ B.Tech. Exams: Exams in April - 2024 Discontinued Students only. B.Tech. All Groups. Last Date of submission 30-11.2023. Cont: N. Prakasham, Cell: 9705039639. [K- 1185675]

SERVICES
BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-1258784]

WANTED

■ కరీంనగర్‌లోని ప్రముఖ 2వీలర్ ఆటో స్టోర్‌లో పనిచేయడంకోసం అనుభవం కలిగిన సేల్స్ మ్యాన్ మరియు కార్ వీల్ అలైన్మెంట్ కోసం అనుభవం కలిగిన టెక్నీషియన్ కావలెను. సంప్ర॥9550 458 288 [K-1185741]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824